క్లుప్తంగా

వివాదాలకు తావులేకుండా సమస్యలు పరిష్కరించుకోవాలి


అర్జీదారుల సమస్యలు వింటున్న అధికారులు

మునగపాక: గ్రామాల్లో ఎటువంటి వివాదాలకు తావులేకుండా సోదరభావంతో మెలగాలని తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు తెలిపారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మండల లెవెల్ అధికారుల సమన్వయ కమిటీ సమావేశంలో భాగంగా అర్జీదారుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యలను స్థానికంగా పరిష్కరించుకోవాలన్నారు. ఇరు వర్గాల వారు సంమయనం పాటించాలని సూచించారు.ఎంపీడీవో ఎం.ఉషారాణి,ఏఎస్ఐ మన్మధరావు, డీటీ పడాల్, సీనియర్ అసిస్టెంట్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శవంతంగా తోటాడ పంచాయతీ


తోటాడలో కాలువల నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కోటేశ్వరరావు

మునగపాక:తోటాడ పంచాయతీని అదర్శవంతంగా తీర్చి దిద్దుతున్నామని వైఎస్సార్‌సీపీ నాయకుడు, సర్పంచ్ దొడ్డి మంగవేణి భర్త కోటేశ్వరరావు తెలిపారు. మండలంలోని తోటాడ పంచాయతీ పరిధిలో జరుగుతున్న కాలువల నిర్మాణ పనులను ఆయన శనివారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో రహదారులు,డ్రైన్లను అభివృద్ధి చేస్తున్నామన్నారు. గతంలో శిథిలావస్థకు గురైన కాలువల స్థానంలో కొత్త కాలువలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రజలు గ్రామాభివృద్ధికి సహకరించాలని కోరారు. వార్డు సభ్యులు దొడ్డి రమేష్, ఉమామహేశ్వరరావు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ రాము తదితరులు పాల్గొన్నారు.

4న రాష్ట్రస్థాయి పాటల పోటీలు

యలమంచిలి రూరల్:గాన గంధర్వుడు దివంగత ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం జ్ఞాపకార్థం వచ్చేనెల 4వ తేదీన యలమంచిలి గుర్రప్ప కల్యాణమండపంలో రాష్ట్రస్థాయి పాటల పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటీ చైర్మన్ ముత్యర్తి రామారావు తెలిపారు.ఉమ్మడి రాష్ట్ర వ్యాప్తంగా గాయకులు ఈ పోటీల్లో పాల్గొంటారన్నారు.పోటీల్లో మొదటి మూడు స్థానాల విజేతలకు నగదు బహుమతులు,జ్ఞాపికలు అందజేస్తామని చెప్పారు. ప్రోత్సాహక బహుమతులు కూడా ఉంటాయన్నారు.అదేరోజు సాయంత్రం 5 గంటలకు ఎస్పీ బాలు పాటల సంగీత విభావరి నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు 9866307171,9948218717 అనే ఫోన్ నంబర్లలో సంప్రదించాలని రామారావు కోరారు.

శరవేగంగా కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణం


నిర్మాణంలో ఉన్న కమ్యూనిటీ హాల్ భవనం

ఎస్.రాయవరం: మండలంలోని గుర్రాజుపేటలో కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. మండల పరిషత్ నిధులు రూ.10 లక్షలతో ఈ భవనాన్ని నిర్మిస్తున్నట్టు సర్పంచ్ రాము రాజు తెలిపారు.

దంచి కొట్టిన వాన


కోటవురట్లలో కురుస్తున్న వర్షం

కోటవురట్ల: తెలవారుతుండగానే వరుణుడు పలకరించాడు. కొద్ది రోజులుగా భానుడు నిప్పులు చెరుగుతుండడంతో ఉక్కిరిబిక్కిరవుతున్న మండల ప్రజలకు వరుణుడు ఉపశమనం కలిగించాడు. శనివారం ఉదయం గంట పాటు కుండపోతగా వర్షం కురిసింది. రహదారులు, పంట కాలువలు, పొలాలు వర్షం నీటితో నిండిపోయాయి.

శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మాకవరపాలెం: అసిస్టెంట్ సర్వేయర్ కోర్సులో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(నాక్)అసిస్టెంట్ డైరెక్టర్ రవికుమార్ తెలిపారు. రెండు నెలల పాటు మాకవరపాలెం మండల కేంద్రంలో ఉన్న నాక్ శిక్షణ కేంద్రంలో శిక్షణ ఇస్తామన్నారు.

గ్రౌండ్ సాక్షి రిపోర్ట్

రోడ్ల నిండా గుంతలు.. కూటమి కళ్లకు గంతలు

- దారుణంగా రహదారులు
- రోడ్ల అభివృద్ధిని గాలికొదిలేసిన సర్కార్
- బూటకపు హామీలతో నాయకులు కాలక్షేపం
- తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న ప్రజలు

పాయకరావుపేట, యలమంచిలి నియోజకవర్గాల్లో పలు రహదారులు అత్యంత ఘోరంగా ఉన్నాయి. గుంతల మధ్యలో రోడ్డు ఎక్కడుందోనని వెతుక్కుంటూ వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నారు. సంక్రాంతి నాటికి గుంతలు లేని రోడ్లు నిర్మిస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చేసిన ప్రకటనలు కార్యరూపం దాల్చలేదు. అడుగుకో గుంత ఉన్నప్పటికీ ప్రభుత్వంలో చలనం లేదు.


వేంపాడు నుంచి తమ్మయ్యపేట గ్రామానికి వెళ్లే రోడ్డు దుస్థితి


ఇందేశమ్మవాక ఘాట్ రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న గొయ్యి

నక్కపల్లి: మండలంలో పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు చాలా అధ్వానంగా ఉన్నాయి. సంక్రాంతి నాటికి గుంతలు లేని రోడ్లు నిర్మిస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ కార్యరూపం దాల్చలేదు. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత కొత్తరోడ్లు వేయలేదు సరికదా, పాడైన రోడ్లకు సైతం మరమ్మతులు కూడా చేయించలేదన్న విమర్శలు వస్తున్నాయి. వేంపాడునుంచి అమలాపురం, పాటిమీదనుంచి రాజయ్యపేట, గుల్లిపాడునుంచి రమణయ్యపేటమీదుగా రేబాక, గొడిచర్ల నుంచి జగన్నాథపురం,కాగిత నుంచి మూలపర జాతీయ రహదారి నుంచి దేవవరం, ఉపమాకనుంచి జానకయ్యపేటగ్రామాలకు వెళ్ల రోడ్లు చాలా అధ్వానంగా ఉన్నాయి.గోతులు పడి రాళ్ల తేలిపోవడంతో రాకపోకలకు చాలా ఇబ్బందిగా ఉంటోందని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా గ్రామాల్లో కూటమి నాయకులకు అనుకూలంగా ఉండే ప్రాంతాల్లోనే రోడ్లు వేసుకున్నారని, జాతీయరహదారి నుంచి గ్రామాలకు వెళ్లే కనెక్టవిటీ రోడ్లు గురించి పట్టించుకోలేదని పలువురు ఆరోపిస్తున్నారు. టోల్ ఫీజు ఎగ్గొట్టేందుకు కాగిత, వేంపాడు మీదుగా రాజయ్యపేట, ఉపమాక వెళ్లే రోడ్లమీదుగా కూటమి నాయకులకు చెందిన భారీ వాహనాలు బండరాళ్ల లోడుతో రాకపోకలు సాగించడం వల్ల శిథిలావస్థకు చేరుకున్నాయి. అధిక లోడు కారణంగా కేసులకు భయపడి ఇలా అడ్డదారిలో రాకపోకలుసాగిస్తున్నారని ఆయా గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పరిమితికి మించి అధిక లోడుతో గ్రామీణ రోడ్లలో రాకపోకలు సాగించే లారీలపై ఆర్అండ్‌బీ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని తెలిపారు.


ఇందేశమ్మవాక ఘాట్‌రోడ్డులో కూలిన రోడ్డుకు అడ్డుగా కట్టిన గోడ

అమలుకాని హామీలు

కోటవురట్ల: మండలంలో ప్రధాన రహదారి గోతులమయంగా ఉంది. మూడు మండలాలను కలిపే నర్సీపట్నం–రేవుపోలవరం రహదారిని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.7 కోట్లతో సుమారు 18 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేసింది. నర్సీపట్నం మండలం పెదబొడ్డేపల్లి నుంచి కోటవురట్ల మండలం రామచంద్రపురం జంక్షన్ శివారు వరకు తారురోడ్డు నిర్మించారు. అక్కడి నుంచి ఎస్.రాయవరం మండలం అడ్డురోడ్డు వరకు సుమారు 12 కిలోమీటర్ల మేర పనులు మిగిలిపోయాయి. అణుకు జంక్షన్ నుంచి ఇందేశమ్మ వాక వరకు రహదారి అధ్వానంగా తయారైంది. ఎన్నికల సమయంలో ఈ రోడ్డును అభివృద్ధి చేస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారు. నేటికీ పనులు పూర్తి చేయకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ప్రధానంగా ఇందేశమ్మవాక వద్ద పెద్ద గోతులు పడి దారుణంగా ఉంది. కైలాసపట్నం నుంచి రాజుపేట, లింగాపురం జంక్షన్ నుంచి కె.వెంకటాపురం, యండపల్లి నుంచి అన్నవరం, కొడవటిపూడి నుంచి కోదండరాంపురం గిరిజన గ్రామానికి, కె.వెంకటాపురం నుంచి తడపర్తి గ్రామానికి వెళ్లే రహదారులను అభివృద్ధి చేయాల్సిఉంది.


గోతులతో నిండిన అన్నవరం రోడ్డు


ఇందేశమ్మవాక ఘాట్‌లో అధ్వానంగా ఉన్న రోడ్డు

నిర్మించిన కొద్ది రోజులకే..


నాసిరకంగా వేసిన పేటసూదిపురం రోడ్డు

ఎస్.రాయవరం: కూటమి ప్రభుత్వంలో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన పెనుగొల్లు వమ్మవరం రోడ్డు పై తారు నాణ్యతాలోపం వల్ల వారం రోజుల్లో పొక్కినట్టు ఊడిపోతోంది. రూ.1.04 కోట్లతో ఈ రోడ్డు పనులు చేపట్టారు. పేటసూదిపురం గ్రామంలో చేపట్టిన రోడ్డు నిర్మాణాన్ని అసంపూర్తిగా వదిలేశారు. వమ్మవరం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడే కాంట్రాక్టర్‌గా ఈ రెండు రోడ్డు పనులు చేస్తున్నారు.


నిర్మించిన వారం రోజుల్లోనే తారు లేచిన వమ్మవరం రోడ్డు


అధ్వానంగా ఉన్న తాటిపల్లి మోడల్ స్కూల్ రోడ్డు

ఏ రోడ్డు చూసినా..

మునగపాక:మండలంలోని పలు రహదారులు నేటికీ అభివృద్ధికి నోచుకోలేదు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే గోతులు లేని రహదారులను నిర్మిస్తామంటూ ఇచ్చిన హామీలు బుట్ట దాఖలయ్యాయి. మండలంలోని నాగవరానికి వెళ్లే రోడ్డు పెద్దపెద్ద గోతులతో దర్శనమిస్తోంది.ఈ రోడ్డుపై అటు పరవాడ,అచ్యుతాపురం ఇటు మండల కేంద్రమైన మునగపాకకు రాకపోకలు సాగిస్తారు. వాహనచోదకులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాటిపల్లి మోడల్ స్కూల్‌కు వెళ్లే దారిలో రాళ్ల తేలిపోవడంతో రాకపోకలు సాగించేవారు అవస్థలు పడుతున్నారు. తిమ్మరాజుపేట నుంచి వాడ్రాపల్లి, నాగులాపల్లి నుంచి తోటాడ త్రిమూర్తుల ఆలయం వరకు నేటికీ పక్కా రోడ్లు నిర్మించలేదు. వాడ్రాపల్లి నుంచి మల్లవరం వరకు మూడు కిలోమీటర్ల మేర దెబ్బతిన్న రోడ్డులోని గోతులను రూ.4లక్షల వ్యయంతో పూడ్చారు.


గోతుల మయంగా ఉన్న నాగవరం రహదారి

తూతూ మంత్రంగా ప్యాచ్ వర్కులు


వెంకటాపురం జంక్షన్ వద్ద ఏర్పడిన గొయ్యి


పంచదార్ల-అప్పారాయుడిపాలెం మార్గంలో ధ్వంసమైన రహదారి

రాంబిల్లి(అచ్యుతాపురం): రాంబిల్లి మండలంలో రహదారుల పరిస్థితి దారుణంగా ఉంది. కొన్ని రోడ్లకు తూతూ మంత్రంగా ప్యాచ్ వర్కులు చేయడంతో అవి మళ్లీ అద్వానంగా తయారయ్యాయి. మండల కేంద్రం రాంబిల్లికి వెళ్లేరోడ్డులో వెంకటాపురం జంక్షన్ వద్ద పెద్ద గుంత ఏర్పడింది. దీంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రాంబిల్లి నుంచి యలమంచిలి వైపు వెళ్లే రెండు రోడ్లలో అప్పారాయుపాలెం రోడ్డు, మరో రహదారి అధ్వానంగా తయారయ్యాయి. కొత్తూరు జంక్షన్,గోకివాడ,మూలజంప తదితర గ్రామాల మీదుగా వెళ్లే రహదారిలో ఎక్కడికక్కడ గోతులు పడ్డాయి. వెంకటాపురం నుంచి కొండపై ప్రాంతాన గల కాలనీలకు వెళ్లే రహదారుల పరిస్థితి మరీ దయనీయం. తాత్కాలిక ప్రాతిపాదిక రహదారులు వేసి వదిలేశారు.57 కిలో మీటర్ల పొడవులో ఉన్న రాంబిల్లి మండలంలోని ఆర్అండ్‌బీ రహదారుల ప్యాచ్ వర్క్‌కు రూ.25 లక్షలకు పైబడి నిధులు కేటాయించారు.అయితే ప్యాచ్ వర్క్ చేసిన కొద్ది కాలానికే రహదారులు పాడైపోయాయని వాహన చోదకులు మండిపడుతున్నారు.

రోడ్డెక్కాలంటే దడ

యలమంచిలి రూరల్:సంక్రాంతి కల్లా రోడ్లను గుంతలు లేకుండా తీర్చిదిద్దుతామని సీఎం చంద్రబాబునాయుడు స్వయంగా చెప్పారు.ఈ గడువు కాస్త ఫిబ్రవరి నెలాఖరుకు మార్చారు. ఏప్రిల్ పూర్తయి,మే నెల కూడా గడిచిపోతోంది.అయినా ఇంకా యలమంచిలి మండలంలో గ్రామీణ రహదారులు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. కొన్ని గ్రామాలకు వెళ్లే రహదారుల్లో అడుగుకోగుంత కనిపిస్తోంది. దీంతో భయంభయంగా ప్రయాణం చేయవలసి వస్తోంది. పులపర్తి హైవే కూడలి నుంచి ఏటికొప్పాక రైల్వే గేటు వరకు వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. జంపపాలెం, రామారాయుడుపాలెం గ్రామాలకు వెళ్లే రహదారుల పరిస్థితి కూడా అలాగే ఉంది.ఇక నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే యలమంచిలి నుంచి గాజువాక వెళ్లే బైపాస్ రహదారిపై గుంతలు దర్శనమిస్తున్నాయి. కొద్ది నెలల క్రితం ఈ రహదారిపై గుంతలను పూడ్చినప్పటికీ నాణ్యతాలోపం కారణంగా కొద్ది రోజులకే మళ్లీ యథాస్థితికి చేరుకున్నాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా రహదారుల పరిస్థితిలో ఎలాంటి మార్పు కనిపించడంలేదు.గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రహదారులు అధ్వానంగా ఉన్నాయంటూ దుష్ప్రచారంతో ఊదరగొట్టిన ఎల్లో మీడియా,కూటమి పార్టీల నాయకులు ఇప్పుడు అధ్వానంగా ఉన్న రహదారుల పరిస్థితిపై మాత్రం నోరు మెదపడంలేదు.అధ్వానంగా ఉన్న రహదారులతో వాహనదారులు,ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.


అధ్వానంగా ఉన్న పులపర్తి- ఏటికొప్పాక రహదారి


గోతులు పడిన యలమంచిలి-గాజువాక బైపాస్ రోడ్డు

ఆదమరిస్తే అంతే..

అచ్యుతాపురం రూరల్ : మండల కేంద్రం అచ్యుతాపురం నుంచి అనకాపల్లి వెళ్లే రహదారిలో రోడ్డు అంచులు దెబ్బ తినడంతో పాటు గోతులతో నిండిపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. 12 అడుగుల వెడల్పు ఉన్న ఈ రోడ్డులో భారీ వాహనాలు రోజూ వేలాదిగా రాకపోకలు సాగిస్తాయి. చిన్న గుంతను తప్పించే ప్రయత్నంలో ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నాయి. పలువురు ప్రాణాలు కోల్పోయారు. ఈ రోడ్డుకు మరమ్మతులు చేసే విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది.


అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


విద్యార్థులతో ఆసనాలు వేయిస్తున్న విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రభాకర్


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సాంబశివరావు

నర్సీపట్నం : విద్యార్థి దశ నుంచే యోగాలో తర్ఫీదు పొందితే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని గ్రంథాలయ అధికారి పి.దమయంతి పేర్కొన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం విద్యార్థులకు నీతి కథలతో పాటు యోగా గురించి వివరించారు. విశ్రాంత వ్యాయామ అధ్యాపకుడు పి.ప్రభాకర్ పలు ఆసనాలు విద్యార్థులతో వేయించారు. ఆసనాలు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రతిదినం యోగా చేయడం వల్ల చదువులో కూడా చురుగ్గా ఉంటారన్నారు.

కె.కోటపాడు : విద్యార్థులకు యోగాతో ఆరోగ్యంతో పాటు చదువులపై ఏకాగ్రత పెరుగుతుందని ఎంపీడీవో సాంబశివరావు అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంపై శనివారం పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లా స్థాయిలో యోగా కార్యక్రమం కోసం మండలానికి చెందిన ఐదుగురు శిక్షణ పొందుతున్నట్టు తెలిపారు. వీరు ఈ నెల 25 నుంచి జూన్ 21 వరకూ గ్రామాల్లో గల సచివాలయాల్లో యోగ శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ ఎస్.అప్పలరాజు, ఈవోఆర్డీ రమణి, ఎంఈవో ప్రసాద్, సత్యనారాయణ పాల్గొన్నారు.

పిల్లల చదువులో తల్లిదండ్రుల పాత్ర కీలకం

మునగపాక: పిల్లల చదువులో తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమని రావులపాలెం డివిజన్ డీఎల్‌డీవో శరగడం తారక వెంకట రాజేశ్వరరావు అన్నారు. మండలంలోని తిమ్మరాజుపేట సత్యసాయిబాబా ఆలయ ప్రాంగణంలో శనివారం రాత్రి తోసా ఆధ్వర్యంలో ఎడ్యుకేషన్ రియలైజేషన్ అండ్ ఫాక్ట్స్‌పై తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ముందుగా టెన్త్‌లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేసిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన చదువు లభిస్తుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడం ద్వారా లక్ష్యాన్ని చేరుకోగలరని చెప్పారు. నిష్ణాతులైన ఉపాధ్యాయుల ద్వారా మంచి విద్య అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఈసీఎస్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఉమాశంకర్, ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్, తోసా అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటప్పారావు,కమిటీ సభ్యులు మళ్ల అప్పలనాయుడు,పెంటకోట మహలక్ష్మినాయుడు,శరగడం వెంకట రెడ్డి నాయుడు,కొయిలాడ శివాజీతో పాటు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం

ఆర్‌వోఆర్ కోర్టు పునఃప్రారంభం

నర్సీపట్నం : ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆర్డీవో కార్యాలయంలో ఆర్‌వోఆర్(రికార్డ్ ఆఫ్ రైట్స్) కార్యకలాపాలను ఆర్డీవో వి.వి.రమణ శనివారం పునఃప్రారంభించారు. గతంలో ఆర్‌వోఆర్ కోర్టును జాయింట్ కలెక్టర్ జిల్లా కేంద్రంలో నిర్వహించేవారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో తిరిగి ఆర్డీవో కార్యాలయంలోనే ఆర్‌వోఆర్ కోర్టు నిర్వహిస్తున్నారు. మొదటి రోజు కొన్ని సంబంధిత కేసులపై ఆర్డీవో ఇరువర్గాలను విచారించి, వారి వాదనలను విన్నారు. ఇకపై ఆర్‌వోఆర్ కోర్టు జిల్లా కేంద్రంలో కాకుండా నర్సీపట్నంలోనే జరుగుతుందని ఆర్డీవో తెలిపారు.

ఏజెన్సీ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి

అనకాపల్లి టౌన్: గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న మైదాన ప్రాంత ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని నోబల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తుంపాల వెంకటరమణ తెలిపారు. జీవో నంబరు 117తో మారుమూల గిరిజన ప్రాంతాలకు బదిలీ అయిన మైదాన ప్రాంత ఉపాధ్యాయుల సమస్యపై పలు దఫాలు గా విద్యాశాఖ మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లగా, న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. అందువల్ల గిరిజన ప్రాంతాల్లో రెండేళ్లు గా విధులు నిర్వహిస్తూ ఇబ్బందులు పడుతున్న మైదాన ప్రాంత ఉపాధ్యాయులకు న్యాయం చేయాలన్నారు.

మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు

కశింకోట: బాలికలు, మహిళల రక్షణ కోసం అనేక చట్టాలున్నాయని, వాటి పట్ల అవగాహన కలిగి ఉండటం అవసరమని ఏఎస్ఐ ఎన్. మణికుమారి తెలిపారు. స్థానిక డీపీఎన్ జెడ్పీ హైస్కూలులో మహిళా చట్టాలపై బాలికలకు శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆకతాయిల బారి నుంచి రక్షణ పొందడానికి, మహిళలకు రక్షణకు కలిగించే శక్తి టీం గురించి, పోక్సో చట్టం గురించి అవగాహన కలిగించారు.

పక్కాగా ఎస్‌హెచ్‌జీ సభ్యుల జీవనోపాధి ప్రణాళిక


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం ప్రభాకర్, ఎంఎంఎస్ మండల అధ్యక్షురాలు లావణ్య

దేవరాపల్లి : కుటుంబాల వారీగా ఎస్‌హెచ్‌జీ సభ్యుల జీవనోపాధి ప్రణాళికను (2025–2026) పక్కాగా సిద్ధం చేస్తున్నట్టు వెలుగు ఏపీఎం ఎస్.ప్రభాకర్ తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు జి.లావణ్య అధ్యక్షతన శనివారం మండల మహిళ సమాఖ్య(ఎంఎంఎస్) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం ప్రభాకర్ మాట్లాడుతూ ఏసీఎల్‌పీ(యాన్యువల్ క్రెడిట్ లైవ్‌లీవుడ్ ప్లాన్) యాప్ ద్వారా ఎస్‌హెచ్‌జీ సభ్యురాలి అవసరాలను గుర్తించి బ్యాంక్ లింకేజీ, అంతర్గత అప్పులు, సామాజిక పెట్టుబడి నిధి, స్త్రీనిధి, ఉన్నతి ద్వారా అవసరమైనంత మాత్రమే రుణ సదుపాయం కల్పిస్తామన్నారు. ఉన్నతి ద్వారా ఎస్సీ, ఎస్టీలకు వారి అవసరాలకు అనుగుణంగా సభ్యురాలికి రూ.లక్ష వరకు రుణం అందజేస్తామని, వాయిదాలను సక్రమంగా చెల్లిస్తే వడ్డీ రాయితీ పూర్తి స్థాయిలో వర్తిస్తుందన్నారు. ప్రతి నెలా ఎస్‌హెచ్‌జీ సమావేశం నిర్వహించి ఆర్థిక లావాదేవీలపై చర్చించాలన్నారు. సదరు సమావేశ ప్రదేశాన్ని జియోట్యాగింగ్ చేయడంతో పాటు సభ్యుల ఎఫ్ఆర్ఎస్‌ను వీవోఏలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీసీలు ఎల్.గౌరీశ్వరరావు, పైడిబాబు, మంగళ, నాయుడు, రాము, అకౌంటెంట్ పార్వతిదేవి పాల్గొన్నారు.

ఎండీయూ వాహనాలు కొనసాగించాలి

దేవరాపల్లి: ఎండీయూ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే రేషన్ విధానాన్ని కూటమి ప్రభుత్వం యథావిధిగా కొనసాగించాలని ఏపీ రాష్ట్ర సమైఖ్య ఎండీయూ ఆపరేటర్ల యూనియన్ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ పి.లక్ష్మీదేవికి మండల ఎండీయూ ఆపరేటర్లు శనివారం వినతి పత్రం అందజేశారు. 2027 జనవరి వరకు ప్రభుత్వంతో తమ అగ్రిమెంట్ ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం ఎండీయూ వ్యవస్థను అర్ధంతరంగా రద్దు చేయడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయంతో ఎండీయూ ఆపరేటర్లు, సహాయకుల కుటుంబాలు రోడ్డున పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండీయూ వ్యవస్థ ద్వారా కచ్చితమైన తూకంతో పాటు ఇంటి వద్దనే పేద ప్రజలు రేషన్ అందుకుంటున్నారని, ఈ విధానాన్ని రద్దు చేయడంతో మళ్లీ రేషన్ కోసం కాలినడకన వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడతాయని అన్నారు. అగ్రిమెంట్ ప్రకారం 2027 వరకు కొనసాగించాలని, లేకుంటే అగ్రిమెంట్ ప్రకారం 20 నెలలకు సంబంధించి మొత్తం బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్‌కు వినతి పత్రం అందించిన వారిలో ఎండీయూ ఆపరేటర్ల యూనియన్ మండల అధ్యక్షుడు చల్లా మహేష్, కార్యదర్శి దొగ్గ రామకృష్ణ, విదుదల అశోక్, బొడ్డు శివాజీ, రెడ్డి పైడంనాయుడు, గండు వెంకటేశ్వర్లు, దారపురెడ్డి శ్రీను పాల్గొన్నారు.